క్లుప్తంగా

మేలు జాతి దూడల ప్రదర్శన



దూడల పోషణపై అవగాహన కల్పిస్తున్న గోపాల మిత్రలు

మిరుదొడ్డి(దుబ్బాక): దశాబ్ది ఉత్సవాల సందర్భంగా పశుగణాభివృద్ధి సంస్థ ఆదేశాల మేరకు మంగళవారం అక్బర్‌పేట–భూంపల్లి మండల పరిధిలోని మోతెలో మేలు జాతి దూడల ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. మేలు జాతి దూడల పోషణపై ఆయా పాడి రైతులకు గోపాల మిత్రలు అవగాహన కల్పించారు. గ్రామంలో ఉన్న 32 దూడలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ కాలేరు శ్రీనివాస్, ఉపసర్పంచ్ నర్మెట మానసరంజీత్, గోపాల మిత్ర షాబొద్దీన్, సూపర్‌వైజర్ అబ్దుల్ సత్తార్, పాడి రైతులు నర్సింహారెడ్డి, మల్లేశం, ప్రశాంత్ పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో సరుకుల పంపిణీ



వృద్ధులకు సరుకులు పంపిణీ చేస్తున్న దృశ్యం

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని చర్లఅంకిరెడ్డిపల్లి శివారులోని అనాథ వృద్ధాశ్రమంలో సిద్దిపేటకు చెందిన తోట శరణ్య జన్మదినం పురస్కరించుకొని తోట విశ్వం ఆధ్వర్యంలో మంగళవారం నిత్యావసర సరుకులు, పండ్లు, బ్రెడ్లు, కూరగాయలు అందజేశారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, క్లబ్ సభ్యులు హరికిరణ్, రవి, వేణుగోపాల్, శంకర్, రాము పాల్గొన్నారు.

చేర్యాల రెవెన్యూ డివిజన్ కమిటీ ఎన్నిక

చేర్యాల(సిద్దిపేట): చేర్యాల రెవెన్యూ డివజన్ సాధనకు మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో జేఏసీ చైర్మన్ డాక్టర్ రామగళ్ల పరమేశ్వర్ ఆధ్వర్యంలో చేర్యాల పట్టణ కమిటీ, చేర్యాల రూరల్, మద్దూరు, దూల్మిట్ట మండలాల కమిటీలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా చేర్యాల పట్టణ కన్వీనర్‌గా తాడెం ప్రశాంత్, చేర్యాల రూరల్ కమిటీ కన్వీనర్‌గా బొమ్మగోని అంజయ్య, మద్దూర్ మండల కన్వీనర్‌గా ఎండీ.తాజ్‌మహ్మద్, దూల్మిట్ట మండల కన్వీనర్‌గా బండి చంద్రం, యూత్ కన్వీనర్‌గా బిజ్జరామును నియమించినట్లు తెలిపారు. రానున్న పది రోజుల్లో గ్రామ కమిటీలు ఏర్పాటు చేసి తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో సకల జనుల సమ్మె తరహాలో రెవెన్యూ డివిజన్ సాధనకు పోరాటాన్ని ఉధృతం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జేఏసీ వైస్ చైర్మన్ పుర్మ ఆగంరెడ్డి, ఆముదాల మల్లారెడ్డి, గురువయ్యగౌడ్, ఆలేటి యాదగిరి, తాడెం వెంకటస్వామి, పోతుగంటి ప్రసాద్, గద్దల మహేందర్, మిట్టపల్లి నారాయణరెడ్డి, సత్తిరెడ్డి, బండి సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు



పాఠశాలను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ వనిత

దుబ్బాక: ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు పని చేస్తున్నాయని దుబ్బాక మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనితాభూంరెడ్డి అన్నారు. మంగళవారం దుబ్బాక పట్టణంలోని డబుల్ బెడ్రూం ఇళ్లలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నంబర్ 2ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ప్రత్యేక శ్రద్ధతో ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు నాణ్యమైన, మెరుగైన విద్య అందుతుందన్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి ప్రభుదాస్, కౌన్సిలర్ ఆస సులోచన, యాదగిరి, కో–ఆప్షన్ సభ్యుడు ఆస స్వామి, హెచ్‌ఎం నరసింహరెడ్డి తదితరులున్నారు.

వైభవంగా పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు



పూజలు చేస్తున్న మధుసూదనానంద సరస్వతిస్వామి

వర్గల్(గజ్వేల్): మండలంలోని మజీద్‌పల్లి పోచమ్మ ఆలయంలో విగ్రహ పునఃప్రతిష్ఠోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా మంగళవారం మూలమంత్రహవనం, పంచ సూక్తములతో యంత్రం, విగ్రహానికి అభిషేకం చేశారు. చండీ హోమం నిర్వహించారు. నాచగిరి క్షేత్రం మధుసూదనానంద సరస్వతిస్వామి ఈ ఉత్సవాల్లో పాల్గొని భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు.

మహిళా ఆర్థికాభివృద్ధికి కృషి

హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్



మహిళా సంఘాల సభ్యులకు బ్యాంక్ లింకేజీ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

హుస్నాబాద్: ప్రతీ పథకంలో మహిళలకు మొదటి ప్రాధాన్యత కల్పిస్తూ సీఎం కేసీఆర్ మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం హుస్నాబాద్ పట్టణంలోని టీచర్స్ ట్రైనింగ్ సెంటర్‌లో మహిళా దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ పాల్గొని మాట్లాడారు. మహిళా లోకం ఆర్థికంగా ఎదగాలని, ఎవరి కాళ్లపై వారే నిలబడాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తూ అనేక పథకాలను అమలు చేస్తుందన్నారు. మహిళల రక్షణకు షీటీమ్స్, మహిళలపై లైంగికదాడులు, గృహ హింసల సత్వర పరిష్కారానికి సఖీ, భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి వారికి అండగా నిలుస్తోందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, పుట్టబోయే పిల్లల ఆరోగ్యం కోసం పోషకాహారం అందిస్తోందన్నారు. మహిళా సంఘాల్లోని సభ్యులు స్వయం కృషితో ఎదగాలని శ్రీనిధి, బ్యాంక్ లింకేజీ, వడ్డీలేని రుణాలు అందిస్తూ మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ఒంటరి మహిళలకు , బీడీ కార్మికులకు పెన్షన్ ఇస్తుందన్నారు. ఈ సందర్భంగా హుస్నాబాద్ నియోజకవర్గంలో మండల మహిళా సమైఖ్యకు బ్యాంక్ లింకేజీ కింద రూ.7కోట్ల చెక్కును ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ అందజేశారు. అనంతరం మహిళా అధికారులను సన్మానించారు. కార్యక్రమంలో హన్మకొండ జెడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, ఎంపీపీలు లకావత్ మానస, మాలోతు లక్ష్మి, కొక్కుల కీర్తి, జెడ్పీటీసీ శ్యామల, సీడీపీఓ, అంగన్‌వాడీ టీచర్లు, మహిళా సమాఖ్య అధ్యక్షులు, సీఏలు, మహిళలు పాల్గొన్నారు.

మొక్కుబడిగా మండల సమావేశం

- పూర్తిస్థాయిలో హాజరుకాని ప్రజాప్రతినిధులు, అధికారులు
- వచ్చినవారు ఫోన్లతో కాలక్షేపం



సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు

సిద్దిపేటఅర్బన్: ప్రజాసమస్యలపై చర్చించి పరిష్కారం కోసం నిర్వహించిన సిద్దిపేట అర్బన్ మండల సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా నిర్వహించారు. మంగళవారం సిద్దిపేట అర్బన్ మండల సర్వసభ్య సమావేశం సిద్దిపేటలోని ఎంపీపీ కార్యాలయంలో ఎంపీపీ వంగ సవితాప్రవీణ్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఉదయం 10 గంటలకు ప్రారంభం కావాల్సిన సమావేశం ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో రాకపోవడంతో గంటన్నర ఆలస్యంగా ప్రారంభమైంది. సమావేశానికి కొంత మంది ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకాలేదు. హాజరైన వారు ఫోన్లతో కాలక్షేపం చేస్తూ కాలం గడిపారు. ఈ సందర్భంగా ఎంపీపీ వంగ సవితాప్రవీణ్‌రెడ్డి మాట్లాడుతూ.. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన చెరువుల పండగ బతుకమ్మ పండగను తలపించిందన్నారు. దశాబ్ది ఉత్సవాలు విజయవంతంగా నిర్వహించుకోవడంలో కీలకపాత్ర పోషిస్తున్న పంచాయతీ కార్యదర్శులను, సర్పంచ్‌లను, ఎంపీటీసీలను అభినందించారు. గ్రామాల్లో అసంపూర్తిగా ఉన్న పనులను త్వరగా పూర్తి చేసేలా అధికారులు చొరవ తీసుకోవాలని, ప్రజాప్రతినిధులు అధికారులను సమన్వయం చేసుకొని పనులు పూర్తి చేయించుకోవాలని సూచించారు. వైస్ ఎంపీపీ అల్లం ఎల్లం మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ రైతుల పక్షపాతి కాబట్టి ఉత్సవాలను రైతు దినోత్సవంతో ప్రారంభించి రైతులకు సముచిత గౌరవం కల్పించారన్నారు. దశాబ్ది ఉత్సవాలను ఆయా శాఖల అధికారులు ముందుండి నిర్వహించాల్సింది పోయి భారం మొత్తం సర్పంచులు, ఎంపీటీసీలపై వేశారని, ఇకనైనా అధికారులు తమ వంతు బాధ్యతను నిర్వహించాలని సూచించారు. బూరుగుపల్లిలో గత సంవత్సరం చెరువులను నింపారని, ఈ సంవత్సరం చెరువులను ఎందుకు నింపలేదని నీటి పారుదల శాఖ అధికారులను సర్పంచ్ కమలాకర్ రావు ప్రశ్నించారు. ఆర్టీసీ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు బాలికలకు, 1 నుంచి 7వ తరగతి వరకు బాలురకు ఉచిత బస్సు పాసుల సౌకర్యం కల్పించిందని దీనిని సద్వినియోగం చేసుకునేలా గ్రామంలో ప్రచారం చేయించాలని ఆర్టీసీ ప్రతినిధి సభ దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో ఎంపీఓ శ్రీనివాసరావు, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు కమలాకర్‌రావు, సర్పంచ్‌లు కొమ్ము రాజయ్య, ఐరేని జయశ్రీ, అంబటి మంగ, కొన్నె కల్పన, భూసాని రాజయ్య, ఎంపీటీసీలు అంబటి శ్రీనివాస్, బోనాల రంగం, మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు బాబు, రాజు, బాలరాజు, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల జీవితాల్లో వెలుగులు



చేర్యాలలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే ముత్తిరెడ్డి తదితరులు

జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి

చేర్యాల(సిద్దిపేట): అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని, తాజాగా సీఎం కేసీఆర్ తీసుకున్న నిర్ణయంతో దివ్యాంగుల జీవితాల్లో వెలుగులు నిండాయని జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అన్నారు. ఇటీవల దివ్యాంగుల పింఛన్ రూ.1000 అదనంగా పెంచడాన్ని హర్షిస్తూ మంగళవారం పట్టణ కేంద్రంలోని అంగడిబజార్ వద్ద గల అంబేడ్కర్ విగ్రహం వద్ద చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, దూల్మిట్ట మండలాల దివ్యాంగులు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దివ్యాంగులకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిచ్చిందని, దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా రూ.4016 పింఛన్ అందించడంతో వారికి ఆర్థిక భరోసా కలిగిందన్నారు. సమాజంలో చిన్న చూపుకు గురైన వారిలో ఆత్మస్థైర్యం నిండిందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ స్వరుపారాణి, వైస్ చైర్మన్ రాజీవ్‌రెడ్డి, చేర్యాల, మద్దూరు ఎంపీపీలు కరుణాకర్, బద్దిపడగ కృష్ణారెడ్డి, రెండు మండలాల పీఏసీఎస్ చైర్మన్లు చంద్రారెడ్డి, తిరుపతిరెడ్డి, దివ్యాంగుల సంఘం రాష్ట్ర నాయకులు గదరాజు యాదగిరి, మల్లన్న ఆలయ కమిటీ చైర్మన్ గీస భిక్షపతి, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు పెడతల ఎల్లారెడ్డి, మల్లేశం, నాలుగు మండలాల సర్పంచ్‌లు, మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు, దివ్యాంగులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లోనే మెరుగైన వసతి



ప్రచారం నిర్వహిస్తున్న అధ్యాపకులు

రాయపోలు(దుబ్బాక): ప్రభుత్వ కళాశాలల్లోనే మెరుగైన వసతులు ఉన్నాయని దౌల్తాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సురేశ్‌రెడ్డి అన్నారు. దౌల్తాబాద్ మండలంలోని దీపాయంపల్లి, గువ్వలేగి, ఉప్పర్‌పల్లి తదితర గ్రామాల్లో మంగళవారం ప్రచారం నిర్వహించారు. ఇటీవల 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులను కలుసుకొని వారికి కళాశాలలో కల్పిస్తున్న వసతులపై వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు రాజు, సుధాకర్, లక్ష్మినారాయణ, మంగ్తానాయ్, శ్రీనివాస్‌రెడ్డి, దయానంద్, సంపత్, శివకుమార్, భాగ్య, నాగేశ్వరరావు, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో ముందంజ

సిద్దిపేటజోన్: రాష్ట్రం వచ్చిన తర్వాతే మహిళలు అన్ని రంగాల్లో ముందంజలోకి వెళ్తున్నారని మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులరాజనర్సు అన్నారు. దశాబ్ది ఉత్సవాల సందర్భంగా స్థానిక విపంచి కళా నిలయంలో ఐకేపీ, అంగన్‌వాడీ, మెప్మా మహిళా సంఘాలతో మహిళా సంక్షేమ దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం మహిళా ప్రజాప్రతినిధులను సన్మానించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ విజిత వేణుగోపాల్‌రెడ్డి, చిన్నకోడూర్ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ వనిత, రూరల్ ఎంపీపీ శ్రీదేవి, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న ఏఓ జయంత్‌కుమార్

చిన్నకోదూరు(సిద్దిపేట): రైతులు ఇతర పంటలతో పాటు ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి సారించి ఆర్థికంగా ఎదగాలని మండల వ్యవసాయ శాఖ అధికారి జయంత్‌కుమార్ అన్నారు. మంగళవారం చిన్నకోదూరు రైతు వేదికలో ఆయిల్‌పామ్ సాగు, వరినార్లపై, పచ్చిరొట్ట విత్తనాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆయిల్‌పామ్ సాగుతో దీర్ఘకాలిక నికర ఆదాయం వస్తుందని పేర్కొన్నారు. దీర్ఘకాలిక ప్రయోజనాలు ఇచ్చే ఆయిల్‌పామ్ సాగుపై రైతులు దృష్టి సారించాలన్నారు. వరిని వెదసాగు ద్వారా సాగుచేస్తే పెట్టుబడి తగ్గి మంచి దిగుబడి వస్తుందన్నారు. రోహిణి మృగశిరలో నార్లు పోసుకోవాలని సూచించారు. రైతులు వరి కొయ్యలను కాల్చొద్దన్నారు. దీంతో భూమి సారవంతం కోల్పోతుందని, అదేవిధంగా పర్యావరణానికి హాని జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఉమేశ్‌చంద్ర, ఏఈఓలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఐటీ టవర్ ప్రారంభోత్సవానికి తరలిరావాలి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): యువతకు ఉపాధి కల్పించే లక్ష్యంతో మంత్రి హరీశ్‌రావు కృషితో నిర్మితమైన ఐటీ టవర్ ప్రారంభోత్సవానికి జిల్లాలోని యువత పెద్ద సంఖ్యలో హాజరుకావాలని బీఆర్‌ఎస్వీ పట్టణ అధికార ప్రతినిధి మేరుగు మాధవ్ అన్నారు. మంగళవారం సిద్దిపేట పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాధవ్ మాట్లాడుతూ.. సిద్దిపేటను ఐటీ రంగలో అభివృద్ధి చేస్తూ, ఇక్కడి యువతకు ఉపాధి కల్పించే విధంగా మంత్రి హరీశ్‌రావు కృషి చేస్తున్నారన్నారు. ఐటీ టవర్ ప్రారంభంతో సిద్దిపేట మెట్రో నగరాల సరసన చేరుతుందన్నారు. ప్రారంభోత్సవానికి ఐటీ శాఖ మంత్రి కేటీఆర్, మంత్రి హరీశ్‌రావులు హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి యువత అధిక సంఖ్యలో హాజరుకావాలన్నారు.

ఘనంగా వంటేరు జన్మదిన వేడుకలు



అభిమానులతో కలిసి కేక్ కట్ చేస్తున్న ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి



జగదేవ్‌పూర్‌లో..

గజ్వేల్: గజ్వేల్‌లో రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ముందుగా పట్టణంలోని సీఎం మినీ క్యాంపు కార్యాలయం వద్ద రక్తదాన శిబిరాన్ని ప్రతాప్‌రెడ్డి ప్రారంభించారు. ఆ తర్వాత క్యాంపు కార్యాలయం నుంచి అంబేడ్కర్ చౌరస్తా మీదుగా ప్రధాన రహదారిపై భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతాప్‌రెడ్డికి అనుకూలంగా నినాదాలు హోరెత్తించారు. అనంతరం క్రేన్ సాయంతో భారీ గజమాలతో ప్రతాప్‌రెడ్డిని సత్కరించారు. ర్యాలీ ముగిసిన తర్వాత అన్నదానం చేపట్టారు. కాగా పలు ఆలయాల్లోనూ ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

జగదేవ్‌పూర్(గజ్వేల్): జగదేవ్‌పూర్‌లోని ఎల్లమ్మ ఆలయంలో నాయకులు ప్రత్యేక పూజలు చేసి కేక్ కట్‌చేసి సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షుడు నరేశ్, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు కిరణ్‌గౌడ్, ఇటిక్యాల సర్పంచ్ చంద్రశేఖర్, పీఏసీఎస్ డైరెక్టర్ భూమయ్య, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

ములుగు(గజ్వేల్): మండలంలోని వంటిమామిడిలో క్షీరసాగర్ కేబీఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు కొన్యాల బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలను బీఆర్‌ఎస్ శ్రేణులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ నరేశ్‌గౌడ్, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు నర్సింహారెడ్డి, మండల బీఆర్‌ఎస్ ఉపాధ్యక్షుడు మల్లేశ్‌యాదవ్, నాగిరెడ్డిపల్లి సర్పంచ్ వెంకట్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

కొండపాక(గజ్వేల్): మండలంలోని దుద్దెడ గ్రామంలో గల స్వయంభూ శంభు ఆలయంలో ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ లక్కిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిల జన్మదినాన్ని పురస్కరించుకొని బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు చిలుముల రాంమోహన్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డిలతో పాటు సర్పంచ్‌లు వారిని కలిసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

వర్గల్(గజ్వేల్): మండల కేంద్రం వర్గల్‌లో కేక్ కట్‌చేసి స్వీట్లు పంచుకున్నారు. బీఆర్‌ఎస్ నాయకులు, ఆ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు వేడుకల్లో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

మర్కూక్(గజ్వేల్): మర్కూక్ మండల కేంద్రంలో వేడుకలు నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో ఎంపీపీ పాండుగౌడ్, జెడ్పీటీసీ మంగమ్మరాంచంద్రం, ఎంపీపీ ఉపాధ్యక్షుడు బాల్‌రెడ్డి, బీసీ సెల్ మండల అధ్యక్షుడు కనకయ్య, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో బోధన



పాఠ్యపుస్తకాలు అందజేస్తున్న ఎంపీపీ పుష్పలత

దుబ్బాకరూరల్: మండలంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో 14 పాఠశాలల విద్యార్థులకు ఎంపీపీ కొత్త పుష్పలత చేతుల మీదుగా పాఠ్యపుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని తెలిపారు. 'మన ఊరు మన బడి' ద్వారా పాఠశాలల్లో మెరుగైన వసతులు కల్పించారన్నారు. ప్రైవేట్‌కు దీటుగా అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు పాఠాలు బోధిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ ప్రభుదాస్, ఏఎంసీ చైర్‌పర్సన్ జ్యోతి, పీఏసీఎస్ చైర్మన్ కైలాష్, హెచ్‌ఎం రాంచంద్రం, సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

రాయపోలు(దుబ్బాక): దౌల్తాబాద్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1990–91 బ్యాచ్ 10వ తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం మంగళవారం నిర్వహించుకున్నారు. స్థానికంగా ఉన్న ఓ ఫంక్షన్‌హాల్‌లో కలుసుకున్న వారు చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ ఆనందంగా గడిపారు.

రేణుకా ఎల్లమ్మకు పూజలు



అమ్మవారికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రసమయి

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని బేగంపేటలో రేణుకా ఎల్లమ్మ ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం నిర్వహించిన కార్యక్రమాల్లో మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రవీందర్‌రెడ్డి, నాయకులు పాపయ్య, శ్రీనివాస్‌గుప్తా, మధు, మల్లేశం , నాయకులు, గౌడసంఘం సభ్యులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ప్రతిష్ఠోత్సవాలు



ఆలయంలో పూజలు చేస్తున్న పండితులు

చిన్నకోదూరు(సిద్దిపేట): మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన నాయకమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు మంగళవారం ఘనంగా కొనసాగాయి. ఉదయం అవాహిత దేవతా పూజ, మహాస్నాపనము, చండీ హోమం, పుణ్యాహవచనం, అఖండ దీపారాధన, పుష్పాధివాసం, శయ్యాధివాసం పూజలు నిర్వహించారు. అమ్మవారికి బోనాలు ఊరేగించారు. ఆలయం వద్ద భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేశారు.

చెత్త సేకరణ పరిశీలన

సిద్దిపేటజోన్: పట్టణంలోని 27వ వార్డులో మంగళవారం ఇంటింటికీ చెత్త సేకరణ ప్రక్రియను మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు పరిశీలించారు. తడి, పొడి, హానికర చెత్త విభజనపై ప్రజలను ఆరా తీశారు. ప్రతి ఒక్కరూ చెత్త వేరుచేసి ఇవ్వాలని సూచించారు. ఒక వ్యక్తి ప్లాస్టిక్ కవర్‌లో మొత్తం చెత్త ఇవ్వడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన వెంట మున్సిపల్ కౌన్సిలర్లు నాగరాజురెడ్డి, సుందర్ తదితరులు పాల్గొన్నారు.



చెత్త సేకరణపై ఆరా తీస్తున్న రాజనర్సు

గ్రామాల అభివృద్ధికి సహకరించాలి

నారాయణరావుపేట మండల సమావేశంలో ఎంపీపీ బాలకృష్ణ



మాట్లాడుతున్న ఎంపీపీ బాలకృష్ణ

సిద్దిపేటరూరల్: గ్రామాల్లోని సర్పంచ్‌లు, అధికారుల సంపూర్ణ భాగస్వామ్యంతో గ్రామాలతో పాటు మండల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీపీ బాలకృష్ణ అన్నారు. మంగళవారం నారాయణరావుపేట మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ బాలకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. దశాబ్ది ఉత్సవాలకు ప్రతీ గ్రామంలోని ప్రజలు సంపూర్ణ మద్దతు ఇవ్వడం సంతోషకరమన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు మండలాన్ని ఆదర్శ మండలంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మురళీధర్‌శర్మ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రేణుకా ఎల్లమ్మ సిద్దోగం



ఆలయ కమిటీ సభ్యులతో ఎంపీ ప్రభాకర్‌రెడ్డి



ఎమ్మెల్యే రఘునందన్‌రావును సన్మానిస్తున్న సభ్యులు

దుబ్బాకరూరల్: మండలంలోని గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రేణుకా ఎల్లమ్మ సిద్దోగ మహోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఈ ఉత్సవాల్లో ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే రఘునందన్‌రావు వేర్వేరుగా పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు వారిని సాదరంగా ఆహ్వానించి సన్మానించారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.